## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 08-11-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- సామాజిక, ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా అందరికీ న్యాయం లభించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.

- అస్సాంలోని మొట్టమొదటి సాంకేతిక, వృత్తి విద్య విశ్వవిద్యాలయానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు శంకుస్థాపన చేశారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉత్తరప్రదేశ్ లోని బనారస్ రైల్వేస్టేషన్ నుండి నాలుగు కొత్త వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈరోజు ప్రారంభించారు.

- వికసిత్ భారత్ సాధనకు పట్టణీకరణ ప్రధాన మార్గమని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖా మంత్రి మనోహర్ లాల్ అన్నారు.

- తమిళనాడు, కేరళలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సామాజిక, ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా అందరికీ న్యాయం లభించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలోని సుప్రీంకోర్టులో న్యాయ సహాయ పంపిణీ విధానాలను బలోపేతం చేయడంపై జరిగిన జాతీయ సమావేశంలో ప్రధానమంత్రి ప్రసంగించారు. అందరికీ న్యాయం జరిగేలా చూడటంలో న్యాయ సహాయం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. న్యాయ పత్రాలను స్థానిక భాషలలో అందుబాటులో ఉంచాలని ప్రధానమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అస్సాంలోని మొట్టమొదటి సాంకేతిక, వృత్తి విద్య శిక్షణ విశ్వవిద్యాలయానికి బిశ్వనాథ్ జిల్లాలోని భోలాగురిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు శంకుస్థాపన చేశారు. 17 ఏళ్ల స్వాతంత్ర్య సమరయోధురాలి పేరిట ఏర్పాటవుతున్న ఈ 'స్వాహిద్ కనకలతా బారువా స్టేట్ యూనివర్సిటీ' కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత, బ్లాక్‌చెయిన్, డ్రోన్, నావిగేషన్ టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, స్మార్ట్ సిటీలు, స్మార్ట్ ఎన్విరాన్‌మెంట్‌లతో సహా వివిధ సాంకేతిక రంగాలలో కోర్సులను అందిస్తుంది. ఇందులో 2 వేల మంది విద్యార్థులకు విద్యా బ్లాక్‌లు, 1,620 మంది విద్యార్థులకు వసతి గృహాలు, అతిథి గృహం, విద్యార్థి సౌకర్యాల కేంద్రం ఉంటాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ఉత్తరప్రదేశ్ లోని బనారస్ రైల్వేస్టేషన్ నుండి నాలుగు కొత్త వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... వందే భారత్, నమో భారత్,

అమృత్ భారత్ వంటి రైళ్లు తదుపరి తరం భారతీయ రైల్వేలకు పునాది వేస్తున్నాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి.. వారి ఆర్థికాభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషించిందాయని ప్రధానమంత్రి తెలిపారు. భారతదేశం కూడా అభివృద్ధి మార్గంలో వేగంగా పయనిస్తోందని పేర్కొన్నారు. కాశీలో మౌలిక సదుపాయాల కల్పన కూడా వేగంగా జరుగుతుందని తెలిపారు. దేశంలో ప్రస్తుతం నడుస్తున్న వందేభారత్ రైళ్ల సంఖ్య 160కి పైగా పెరిగిందని ప్రధానమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...34 సెకన్లు)

ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్వినివైష్ణవ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మేరా యువ భారత్ సంస్థ పుదుచ్చేరిలో నాలుగు కిలోమీటర్ల ఐక్యతా నడక (యూనిటీ వాక్)ను ఈరోజు నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ జెండా ఊపి ప్రారంభించారు. శాసనసభ స్పీకర్ ఆర్. సెల్వం, హోంమంత్రి ఎ.నమశ్శివాయంతో పాటు పదిహేను వందల మందికి పైగా పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ సాధనకు పట్టణీకరణ ప్రధాన మార్గమని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖా మంత్రి మనోహర్ లాల్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో నేషనల్ అర్బన్ కాన్ క్లేవ్-2025 ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ పరివర్తన.. పౌరుల కేంద్రీకృతంగా, స్థిరంగా ఉండాలని తెలిపారు. గత దశాబ్దంలో పట్టణ పెట్టుబడులు వేగంగా పెరిగాయని మంత్రి మనోహర్ లాల్ పేర్కొంటూ...

(వాయిస్ బైట్...21 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు శీతాకాల సమావేశాలను డిసెంబర్ 1 నుండి 19వ తేదీ వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారని, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సామాజిక మధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ, దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్మాణాత్మక సమావేశాల కోసం ప్రభుత్వం ఎదురుచూస్తోందని మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్ రాష్ట్ర అవతరణ రజతోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు డెహ్రాడూన్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి, స్మారక తపాలా బిళ్ళను ఆవిష్కరించి, సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ పర్యటన సందర్భంగా... ప్రధాని మోదీ 930 కోట్ల రూపాయలకు పైగా విలువైన ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు, 7,200 కోట్ల రూపాయలకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో ఏడుగురు మావోయిస్టులు ఈరోజు పోలీసుల వద్ద లొంగిపోయారు. రాయ్‌పూర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అమ్రేష్ మిశ్రా ముందు వారు తమ ఆయుధాలను అప్పగించారు. ఈ మావోయిస్టులపై మొత్తం ముప్పై ఏడు లక్షల రూపాయల రివార్డు ప్రకటించబడి ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆస్ట్రేలియాలో బ్రిస్బేన్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈరోజు జరిగిన ఐదో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. తొలుత టాస్ గెలిచిన ఆసీస్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ ప్రారంభించిన భారత జట్టు ఆట ఆగే సమయానికి 4.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 52 పరుగులు చేసింది. వర్షం తగ్గే సూచనలు

లేకపోవడంతో  అంపైర్లు ఈ మ్యాచ్‌ను రద్దు చేశారు. దీంతో భారత జట్టు 2-1 తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా అభిషేక్ శర్మ నిలిచాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లా కేరన్ సెక్టార్‌లో నిన్న రాత్రి భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు చొరబాటుదారులు మరణించారు. ఎల్‌ఓసి వైపు చొరబడటానికి ప్రయత్నిస్తున్న ఉగ్రవాదుల బృందాన్ని భారత దళాలు అడ్డుకున్నాయని ఆర్మీ ప్రతినిధి తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్ లో ఇద్దరు గుర్తుతెలియని చొరబాటుదారులు మరణించారని, ఈ ప్రాంతంలో ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని ప్రతినిధి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు నుండి 13వ తేదీ వరకు అంగోలా, బోట్స్వానా దేశాల  పర్యటన కోసం బయలుదేరి వెళ్లారు. వాణిజ్యం, రక్షణ, ప్రజల మధ్య సంబంధాలు వంటి రంగాలలో భాగస్వామ్యాలను పెంపొందించడంపై ప్రధానంగా రాష్ట్రపతి పర్యటన జరుగుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడు, కేరళలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది. మహే, పుదుచ్చేరి, కారైకల్ లలో రాబోయే రెండు రోజుల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని IMD తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 11వ తేదీ నుండి రెండు రోజుల పాటు భూటాన్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో.. ప్రధాని, భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్ తో కలిసి వెయ్యి ఇరవై మెగా వాట్ల పునత్ సంగ్‌చు-2 జలవిద్యుత్ ప్రాజెక్టును ప్రారంభిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =